సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం ❘ 11 ❘ నవంబర్ ❘ 2023



13న 'స్పందన' ఉండదు

దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ నెల 13న ప్రభుత్వం సెలవు ప్రకటించిందని స్పందన కార్యక్రమం కూడా ఉండదని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.



టమాట కిలో రూ.30

స్థానిక కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 ప్రకారం పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
35.4°/20.4°

శ్రీసత్యసాయి జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి అఖండ భజన



సత్యసాయి మహా సమాధి (ఫైల్)

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో విశ్వ శాంతిని కాంక్షిస్తూ శనివారం సాయంత్రం నుంచి అఖండ భజన ప్రారంభం కానుంది. ప్రతి ఏటా అఖండ భజన సత్యసాయి జయంతి వేడుకల ప్రారంభానికి ముందు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అఖండ భజన నిర్వహించేందుకు ప్రశాంతి నిలయంలో ఏర్పాట్లు చేశారు. ఏకకాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్య సాయి మందిరాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు అఖండ భజనను ప్రారంభించనున్నారు. 24 గంటల పాటు నిర్విఘ్నంగా అఖండ భజన నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మంగళ హారతితో భజన కార్యక్రమం ముగియనుంది.

అహుడా చైర్మన్‌గా 'మహాలక్ష్మి' కొనసాగింపు



మహాలక్ష్మి శ్రీనివాస్

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) చైర్మన్‌గా మహాలక్ష్మి శ్రీనివాస్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2021లో అహుడా చైర్మన్‌గా మహాలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం మరోసారి ఆయన్ను కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు మహాలక్ష్మి శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆ పదవికి న్యాయం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 18 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో అహుడా ముందంజలో ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ధర్మవరంలో 124 ఎకరాల్లో, రాప్తాడు వద్ద రామినేపల్లి 80 ఎకరాలు, కొడికొండ చెక్‌పోస్టు వద్ద 7.20 ఎకరాలు, పెనుకొండలో 28 ఎకరాలు, కూడేరులో 26 ఎకరాలు, గుత్తిలో 11.26 ఎకరాల్లో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అహుడాను ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

గోరంట్ల: అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మండల పరిధిలోని కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ తెలిపారు. అశోక్ లైలాండ్ (కేఏ50 ఏ6767) వాహనంలో శిరగం హరినాథరెడ్డి, డ్రైవర్ నరేష్ 36 క్వింటాళ్ల (140 ప్యాకెట్లు) పీడీఎస్ రైస్‌ను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఇందులో భాగంగానే రెవెన్యూ అధికారులతో కలసి సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. బియ్యాన్ని గోరంట్ల స్టాక్ పాయింట్‌కు తరలించామన్నారు. హరినాథరెడ్డి, నరేష్‌తో పాటు బియ్యం తరలించడానికి వినియోగించిన వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఆర్‌ఐ సోముశేఖర రెడ్డి, వీఆర్‌ఓ మన్సూర్‌బాషా, విజిలెన్స్ ఎస్‌ఐ పణీంద్రరెడ్డి, తాడిపత్రి సీఎస్‌డీటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లె వాకిట్లో పాల పొంగు

జిల్లాలో పాడి వివరాలు	
పాడి రైతులు	1.70 లక్షలు
పాడి ఆవులు	2.10 లక్షలు
గేదెలు	82 వేలు
ఒక్కో జీవానికి కృత్రిమ గర్భధారణ ఖర్చు	రూ.1,350
రైతు వాటా	రూ.500
ప్రభుత్వ సబ్సిడీ	రూ.850

- పాల దిగుబడి పెంపునకు ప్రభుత్వం చర్యలు
- పశువుల కృత్రిమ గర్భధారణకు శ్రీకారం
- అందుబాటులో మేలు జాతి పశువుల వీర్యం
- రైతులకు సబ్సిడీపై అందజేత
- 99 శాతం పెయ్యదూడలే పుడతాయంటున్న అధికారులు





పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు, అమడగూరులో ఓ రైతు ఇంట ఇటీవల జన్మించిన పెయ్యదూడ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పాల దిగుబడి పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మేలు జాతి పశువుల వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించి పెయ్య దూడల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతోంది. ఇప్పటికే పలువురు రైతుల ఇంట పెయ్య దూడలు జన్మించడం విశేషం.

తప్పిన వ్యయ ప్రయాసలు..

గతంలో మేలు జాతి పశువుల కోసం రైతులు ఇతర రాష్ట్రాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లేవారు. కొనుగోలు చేసి వాహనాల్లో తీసుకొచ్చేవారు. ఆ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ స్థానిక పశువైద్య శాలల్లోనే మేలు జాతి పశువుల వీర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని 23 పశువైద్య శాలల్లో వీటిని సిద్ధంగా ఉంచారు. రైతులకు అవసరమైతే వెంటనే గ్రామాలకు సరఫరా చేసి కృత్రిమ గర్భధారణ చేయిస్తారు.

రైతులకు రాయితీపై..

సాధారణంగా ఒక్కో పశువుకు కృత్రిమ గర్భధారణకు రూ.1,350 ఖర్చవుతుంది. అయితే రూ.850ను సబ్సిడీగా తానే భరిస్తూ రైతు కేవలం రూ.500 చెల్లిస్తే చాలు వీర్య నాళికలను రెండు డోసులుగా పశువులకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో కేవలం పెయ్య దూడలే పుడతాయని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఒక డోసు విఫలమై గర్భం దాల్చకుంటే, రెండో డోసు ఉచితంగా అందజేస్తారు.

గ్రామాల్లో అవగాహన..

ఈ వీర్య సాంకేతిక పద్ధతిపై ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పాల దిగుబడి ఎక్కువగా ఉండే రకాలైన ముర్రా, గిర్, జెర్సీ, హెచ్‌ఎఫ్ జెర్సీ, సాహివాల్ తదితర మేలు జాతి పశువుల వీర్యాన్ని అందుబాటులోకి తేవడం గమనార్హం. అవసరమైన రైతులు స్థానిక గ్రామ/ వార్డు సచివాలయాల్లోని వెటర్నరీ అసిస్టెంట్లను సంప్రదించాలి.

చాలా మంచి కార్యక్రమం



సుమారు 12 ఏళ్ల నుండి పాడి పశువుల పెంపకంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పెయ్య దూడ పుడితే మహాలక్ష్మీ పుట్టినట్టేనని భావిస్తాను. గతంలో మేలు జాతి పశువుల కోసం ఇతర రాష్ట్రాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లేవాళ్లం. అలాంటి బాధలు తప్పిస్తూ పాడి రైతుల కోసం మంచి కార్యక్రమాన్ని ప్రభుత్వమే చేపట్టడం ప్రశంసనీయం.

– సుధాకర్, పాడి రైతు, ప్రశాంతిగ్రామం

రుణపడి ఉంటాం



పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. 'జగనన్న పాలవెల్లువ' ద్వారా ఇప్పటికే గిట్టుబాటు ధరలు కల్పించింది. గ్రామాల్లోని ఆర్‌బీకేల్లోనే పశు వైద్యం మందులు అందుతున్నాయి. ఈ పథకం ద్వారా పెయ్య దూడలు పుడితే చాలా ఆనందం. అన్ని వర్గాల కోసం పథకాలు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– లక్ష్మీపతి, సుబ్బరాయనిపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



కృత్రిమ గర్భధారణపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే 2,300 పశువులకు వీర్యం అందించాం. అన్నీ పెయ్య దూడలే పుట్టాయి. సాధారణంగా కృత్రిమ గర్భధారణకు ఒక్కో పశువుకు రూ.1,350 ఖర్చు అవుతుంది. రైతు వాటాగా కేవలం రూ.500 చెల్లిస్తే, ప్రభుత్వం రూ.850 సబ్సిడీ భరిస్తుంది. సద్వినియోగం చేసుకోవాలి.

– శుభదాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



పుట్టపర్తి అర్బన్: స్వాతంత్య్ర సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యావంతులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీ, మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

దీపావళికి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: దీపావళి పండగ సందర్భంగా శనివారం నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా బీదర్–యశ్వంత్‌పూర్ మధ్య స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ జంక్షన్ నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు (06506) బయలుదేరి 12వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (06507) 13న రాత్రి 11.15 గంటలకు యశ్వంత్‌పూర్ జంక్షన్ నుంచి బయలుదేరి 14న మధ్యాహ్నం 12.15 గంటలకు బీదర్ జంక్షన్ చేరుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ జంక్షన్ నుంచి రైలు (06508) బయల్దేరి యశ్వంత్‌పూర్ జంక్షన్‌కు 15వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జాగ్రత్తలతో ఆనంద దీపావళి

- టపాసుల విక్రయాలు షురూ
- బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు
- జిల్లాలో 223 దుకాణాల ఏర్పాటు
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు



పుట్టపర్తిలో ఏర్పాటైన బాణాసంచా దుకాణాలు

పుట్టపర్తి అర్బన్: వెలుగుల పండుగ దీపావళిని ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఇక.. దీపావళి పండుగ అనగానే అందరికీ గుర్తొచ్చేది టపాసులు. అయితే క్రాకర్స్ కాల్చే విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని అధికారులు, నిపుణులు చెబుతున్నారు. దీపావళి పండుగరోజు టపాసులు కాల్చే విషయంలో అజాగ్రత్తగా ఉండి ఎంతో మంది గాయాలపాలైన సందర్భాలున్నాయి. ఒక్కోసారి దీపావళి టపాసుల వల్ల కళ్లు కోల్పోయిన వారు కూడా ఉన్నారు. అందుకే దీపావళికి బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకొని, సేఫ్ దీపావళి జరుపుకోవాలని సూచిస్తున్నారు.

వ్యాపారస్తులకు అనుమతులు..

జిల్లాలో బాణాసంచా వ్యాపారానికి సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు అనుమతులను కూడా మంజూరు చేశారు. ఇప్పటి వరకూ 223 మంది వ్యాపారులు అనుమతులు పొంది బాణాసంచా దుకాణాలు ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. పట్టణ సమీపంలోని ఆటస్థలాలు, ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించారు.

కదిరిలోనే అత్యధికం..

దీపావళి రోజు టాపాసులు అమ్మడానికి జిల్లాలోని పలు పట్టణాలు, మండలాలకు సంబంధించి 223 షాపులు ఏర్పాటుకు అనుమతించారు. ఇందులో అత్యధికంగా కదిరి లోని బాయ్స్ కాలేజీగ్రౌండులో 44 షాపులు, హిందూపురం ఎంజీఎం స్కూల్ గ్రౌండులో 43, ధర్మవరం కాలేజీ గ్రౌండులో 19 , గోరంట్లలోని ఎస్‌ఏపీఎస్ కళాశాల ఎదురుగా ఉన్న గ్రౌండులో 18, కొత్తచెరువు మార్కెట్ యార్డులో 12, పుట్టపర్తి సమీపంలోని చిత్రవతి నది పక్కన 11, చిలమత్తూరులో 6, పెనుకొండ జూనియర్ కళాశాల గ్రౌండులో 7, ఓడీసీ వశిష్ట స్కూల్ గ్రౌండులో 8, సోమందేపల్లిలో 7, తనకల్లులో 6, ముదిగుబ్బ, నల్లమాడలో 5 చొప్పున మొత్తం 28 మండల కేంద్రాలకు దుకాణాల ఏర్పాటుకు అనుమతించారు. రోడ్లపై బాణాసంచా విక్రయాలు జరగకుండా చూడాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

నిబంధనలు పాటించాలి..

బాణాసంచా దుకాణాలు ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. జనావాసాలకు దూరంగా ఉన్న చిన్న భవనంలో ఏర్పాటు చేసుకోవచ్చు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రమాదవశాత్తు మంటలు చలరేగితే నియంత్రించే ఏర్పాట్లు చేసుకోవాలి.

టపాసులు కాల్చే వారు...

టపాసులు కాల్చాలనుకునే వారందరూ అనుమతి పొందిన దుకాణాల నుంచి మాత్రమే బాణాసంచా కొనుగోలు చేయాలి. అగ్ని ప్రమాదాలు జరగని ప్రదేశాల్లో వీటిని భద్రపరచాలి. బాణాసంచా కాల్చే సమయంలో ప్యాకెట్‌పై ఉన్న నిబంధనలు పాటించాలి. ఖాళీ ప్రదేశాల్లోనే టపాసులు కాల్చాలి. బాణాసంచా కాల్చే సమయంలో నీటిని కూడా అందుబాటులో ఉంచుకోవాలి. కాల్చేవారు కాటన్ దుస్తులు ధరించాలి. లూజు దుస్తులను ధరించకూడదు. కచ్చితంగా చెప్పులు ధరించాలి. రద్దీ ప్రదేశాల్లో పెద్ద పెద్ద టపాసులు కాల్చరాదు పెద్దల పర్యవేక్షణలోనే చిన్న పిల్లలు బాణా సంచా కాల్చాలి. బాంబులు వంటివి చేతితో పట్టుకొని కాల్చకూడదు.



ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు



జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ దీపావళి పండుగను జరుపుకోవాలి. ఎవరూ ప్రమాదాలనుకొని తెచ్చుకోకూడదు. చిన్న పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దగ్గరుండి వారితో టపాసులు కాల్పించాలి. షాపులు ఏర్పాటు విషయంలో కఠిన నిబంధనలు విధించాము. ప్రజలే కాకుండా షాపుల యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలి.

– అరుణ్‌బాబు, కలెక్టర్

పనులు త్వరితగతిన పూర్తి చేయండి



బుచ్చయ్యగారిపల్లి వద్ద పోలీస్ ఫైరింగ్ రేంజ్ పనులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి: జిల్లా పోలీస్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ తదితరులతో కలిసి బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి, చంద్రాయునిపల్లి మధ్య బుక్కపట్నం, ముదిగుబ్బ ప్రధాన రహదారి పక్కన పోలీస్‌శాఖకు కేటాయించిన 4.40 ఎకరాలు భూమిలో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ భూమితో పాటు రెవెన్యూ అధికారులు మరికొంత భూమిని కేటాయించారు. ఈ స్థలాన్ని అభివృద్ధి చేసి పోలీస్‌శాఖ అవసరాల నిమిత్తం ఉపయోగించుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఏఆర్ అడ్మిన్ టైటాస్, రాజశేఖర్, ఎస్‌ఐలు నరసింహుడు, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేయ్.. మాపైనే నీళ్లు పోస్తావా !

- దళిత యువకుడిని చితకబాదిన పరిటాల శ్రీరామ్ అనుచరులు
- కులం పేరుతో దూషణలు
- ఈ నెల 7న రాత్రి ఘటన... ఆలస్యంగా వెలుగులోకి

అనంతపురం/రాప్తాడురూరల్: అన్నం వడ్డించే క్రమంలో పొరబాటున నీళ్లు పడడంతో ఓ దళిత యువకుడిని పరిటాల శ్రీరామ్ అనుచరులు చితకబాదారు. ఈ నెల 7న అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి క్రాస్ సమీపంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన దళిత శేఖర్ ఓ ప్రైవేట్ కంటి ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. ఆస్పత్రి యజమాని, అతడి స్నేహితులు ఈ నెల 7న బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు సమీపంలోని తోటలో విందు ఏర్పాటు చేసుకున్నారు. పరిటాల శ్రీరామ్ అనుచరులైన ఇటుకలపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్కులప్ప కుమారుడు అనిల్, మాల్యవంతం శీన, ముష్టూరు సాంబ, ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన ఎస్‌ఎంఎస్ రాజు హాజరయ్యారు. యజమాని సూచన మేరకు శేఖర్ ఏర్పాట్లలో పాల్గొన్నాడు. భోజనం వడ్డించే క్రమంలో శేఖర్ గ్లాసులో నీళ్లు పోస్తుండగా పొరపాటున శ్రీరామ్ అనుచరులపై పడ్డాయి. అక్కడే శేఖర్‌తో వాగ్వాదానికి దిగారు. అక్కడున్న వారు కల్పించుకుని సర్ది చెప్పారు. విందు ముగించుకుని రాత్రి 11 గంటల సమయంలో శేఖర్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి అనంతపురం నగరానికి బైకులో బయలుదేరారు. కృష్ణంరెడ్డిపల్లి క్రాస్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి పోలీస్ సైరన్‌తో బొలెరో వాహనంలో వచ్చి బైక్‌ను ఆపారు. వాహనం నుంచి కిందకు దిగిన అనిల్, మాల్యవంతం శీన, సాంబ, రాజు నలుగురూ కలిసి శేఖర్‌పై దాడికి పాల్పడ్డారు. 'పార్టీలో మా మీద నీళ్లు పోస్తావారా.. నా కొడకా! మేము ఎవరో తెలుసారా?' అంటూ కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడు ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు నిందితులు నలుగురిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పుట్టపర్తి: బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్లను ఎంపిక చేశారు. హెచ్‌ఎం జగదీశ్వర్, డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ వెంకటేశ్వర ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 8వ తేదీ నుంచి 10 వరకూ బాపట్లలో జరిగే 42వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ పూల ప్రసాద్, సిబ్బంది నాగరాజు, ఉషారాణి, నిర్మల,అశ్విని పాల్గొన్నారు.

ఎంపికైన బాలుర జట్టు ...

చరణ్‌కుమార్, ఆకాష్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, గణేష్, నిఖిల్ సాయి, తరుణ్, పవన్‌నాయక్, విజయ్‌కుమార్, గిరీష్, హర్షవర్ధన్, సాయిజశ్వంత్.

బాలికల జట్టు: సుస్మిత, నవ్య, తేజస్విని, పెద్దక్క, వెన్నెల, మణిమాల, నిరోష.











ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణం


స్వామి చిత్ర పటాలు అందిస్తున్న చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ శ్రీనివాసరెడ్డి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శుక్రవారంరాత్రి విష్ణు సహస్రనామ పారాయణం ఆచరించారు. శ్రీనారప్ప స్వామి నందిమఠం గోరంట్ల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, నరసింహస్వామి చరిత్ర, భరతనాట్యం, భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ శ్రీనివాసరెడ్డి ప్రశంసాపత్రాలు, స్వామి చిత్రపటాలు అందించారు.

ముగ్గురు గొర్రెల దొంగల అరెస్టు

బత్తలపల్లి: వ్యసనాలకు బానిసై గొర్రెల అపహరణకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈదుల ముష్టూరు, విశ్వనాథపురంలో గొర్రెలు అపహరణకు గురైనట్లు కేసులు నమోదయ్యాయి. వీటిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఆరోహణరావు నేతృత్వంలో సిబ్బంది విచారణ చేపట్టారు. అందులో భాగంగా ధర్మవరం మండలం ఏలుకుంట్లకు చెందిన దాసరి లక్ష్మన్న, దాసరి రాము, ధర్మవరం టౌన్ కేతిరెడ్డి కాలనీకి చెందిన లోచర్ల బాలకృష్ణ నిందితులుగా నిర్ధారణ అయ్యింది. శుక్రవారం మధ్యాహ్నం లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 31 పొట్టేళ్లు విక్రయించగా వచ్చిన నగదు రూ.1,50,000 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ధర్మవరం కోర్టులో హాజరుపరిచారు. నిందితులను పట్టుకున్న ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు సుదర్శన్, పెద్దారెడ్డి, జనార్దన్, ఆంజనేయులును అభినందినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్కేయూ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పదవీ కాలం ఈ నెల 23తో ముగియనుంది. ఈ నేపథ్యంలో నూతన వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీని రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావును నియమించారు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఈ ముగ్గురు మూడు పేర్లను ప్రతిపాదిస్తారు. ఇందులో ఒకరిని వీసీగా చాన్సలర్/ గవర్నర్ నియామకం చేస్తారు. సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ నామినీగా ప్రొఫెసర్ డి.జమున (మాజీ వీసీ, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ, తిరుపతి), యూనివర్సిటీ పాలకమండలి నామినీగా ప్రొఫెసర్ డీఎన్ రెడ్డి (మాజీ వీసీ, జేఎన్‌టీయూ, హైదరాబాద్, తెలంగాణ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నామినీగా ప్రొఫెసర్ సారిత్ కుమార్ దాస్ (వి.బాలకృష్ణన్ చైర్ ప్రొఫెసర్, మెకానికల్ ఇంజినీరింగ్, మద్రాస్ ఐఐటీ)లను నియమించారు. త్వరలోనే సెర్చ్ కమిటీ సమావేశమై దరఖాస్తులన్నింటినీ పరిశీలించి మూడు పేర్లను ప్రతిపాదించనుంది.

జాతీయ హాకీ పోటీలకు డిజిటల్ అసిస్టెంట్ ఎంపిక


పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: పోట్లమర్రి సచివాలయ డిజిటల్‌అసిస్టెంట్ పవన్‌కుమార్ ఆలిండి యా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర జట్టుకు ఎంపికైనట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ శుక్రవారం తెలిపారు. పవన్‌కుమార్ భువనేశ్వర్‌లో ఈనెల 15 నుంచి 24 వరకు జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు.ఎంపీడీఓ, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఈదుల ముష్టూ రు, పోట్లమర్రి సర్పంచులు చెడిపోతుల గోపాల్, అక్కిం దామోదర్ అభినందించారు.

క్వారీ యజమానిపై హత్యాయత్నం

- డబ్బు విషయంలో గొడవ


గాయపడ్డ సుశీల్

అనంతపురం క్రైం: నగరంలో గ్రానైట్ క్వారీ యజమానిపై హత్యాయత్నం జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు ... అనంతపురం సాయినగర్‌లో నివాసముంటున్న సుశీల్‌కు బుక్కరాయసముద్రం, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర, కదిరి ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. మూడు నెలల కిందట కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన నూర్ అనే వ్యక్తితో రాయిని కోసే మిషన్, ఇతర పరికరాలు అద్దెకు తీసుకుని, బుక్కరాయసముద్రంలోని క్వారీకి తీసుకెళ్లాడు. సెట్ చేసిన తర్వాత మిషన్ పనిచేయలేదని యజమానికి సమాచారమిచ్చాడు. వినియోగంలోకి తీసుకొచ్చిన రోజు నుంచి తాను అద్దె చెల్లిస్తానని స్పష్టం చేశాడు. అయితే నూర్ మిషన్ రిపేరీకి టెక్నీషియన్లను పంపించకపోగా.. నెలల తరబడి పరికరాలను క్వారీలోనే ఉంచాడు. ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం ఫోన్ చేసి లారీ తెచ్చి మిషన్‌ను తీసుకెళ్తామని నూర్ చెప్పాడు. తమకు మూడు నెలల అద్దె చెల్లించాల్సి ఉంటుందని, ఇవ్వకపోతే అంతు చూస్తామంటూ హుకుం జారీ చేశాడు. పని చేయని మిషన్‌కు ఎలా అద్దె చెల్లిస్తామని సుశీల్ ప్రశ్నించాడు. దీంతో నూర్ ఫోన్ పెట్టేసి కారులో తన అనుచరుడితో కలిసి అనంతపురంలోని సుశీల్ ఇంటికి చేరుకున్నాడు. వచ్చీ రాగానే సుశీల్ సోదరుడిపై దాడి చేసి, లోపలి నుంచి వచ్చిన సుశీల్‌పై కత్తి, ఇనుపరాడ్లతో విరుచుకుపడ్డారు. సుశీల్ తలకు తీవ్ర గాయమైంది. భయాందోళన గురైన సుశీల్ కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేశారు. పోలీసులు వస్తారన్న భయంతో నూర్ తన అనుచరులతో కలిసి కారులో ఉడాయించేందుకు ప్రయత్నించాడు. అలా వేగంగా వెళ్లే క్రమంలో ఆ వీధిలోని కాంపౌండ్‌ను ఢీకొట్టి..కారు కల్వర్టులో ఇరుక్కుంది. ఈ ఘటనలో నూర్ అనుచరుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని నూర్‌తో పాటు అతని అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాల పాలైన సుశీల్‌ను కుటుంబ సభ్యులు సర్వజనాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుల హల్‌చల్

పెనుకొండ: పట్టణంలోని ఆల్విన్ కాలనీలో కియా ఉద్యోగులు అర్ధరాత్రి వేళ హల్‌చల్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు.. ఆల్విన్ కాలనీలో కియా, అనుబంధ పరిశ్రమల్లో పనిచేసే బిహార్ యువకులు స్థానికుల ఇళ్ల వద్దకు వెళ్లి తలుపులు కొట్టడం, అర్ధనగ్నంగా తిరుగుతుండగా మహిళలు భయాందోళనకు గురయ్యారు. వలంటీర్ గంగరత్నమ్మ, కాలనీ పెద్దలు శంకర్, నాగరాజు, నూర్‌మహమ్మద్, డ్యానియేల్, శ్రీనివాసులు సహకారంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కాలనీలోకొచ్చి యువకులను అదుపులోకి తీసుకున్నారు.





